

సంసారంలో సరిగమలు - తమస్విని



(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..

కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,

కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..

వెరసి సంసారంలో సరిగమలు..!)

కార్యేషు....

"శివా. ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి." కుమార్ మిత్రుడ్ని చూసి గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు.

"సంధ్యా వీడు నా బెస్ట్ ఫ్రెండ్ శివ. శివకుమార్. నేను చంద్రకుమార్. మా స్కూల్‌లో అందరూ కుమార్ స్క్వేర్ అనేవాళ్ళు. కుమార్లు అని కూడా" భార్యకి పరిచయం చేసాడు.

శివ నవ్వాడు.

"కువైట్‌లో ఉంటున్నానండి. నాన్నకి బాలేదంటే వచ్చాను. ఇప్పుడు బానే ఉన్నారు" చెప్పాడు.

స్నేహితులిద్దరూ హైస్కూల్ కబుర్లు చెప్పుకుంటూంటే సంధ్య వంట గదిలోకి వెళ్ళింది.

కొంత సంభాషణ తర్వాత శివ ఇబ్బందిగా అడిగాడు.

"అంకుల్ చాలా వంటరితనం ఫీల్ అవుతున్నారు. నీ దగ్గరకి పిలవచ్చుగా?"

"నీకెలా తెలుసు? నాన్నని కలిసావా?" కుమార్ ఆశ్చర్యంగా అడిగాడు.

"లేదు. అంకుల్ ఆంటీని బాగా మిస్సవుతున్నారు. ఫేస్‌బుక్‌లో చూడటం లేదా?"

"మా నాన్న నా ఫ్రెండ్ కాదు. ఏం రాసారేంటి?" కుమార్ ఆసక్తిగా అడిగాడు.

"భోజనాలు చేసి మాట్లాడుకోండి" సంధ్య పిలిచింది.

భోజనాలు అయ్యాక శివ తన ఫోన్‌లో ఫేస్‌బుక్ ఓపెన్ చేసి కుమార్‌కి ఇచ్చి చెప్పాడు.

"చదువు. అంకుల్ ఇంత సెన్సిటివ్ అనుకోలేదు."

సంధ్య కూడా ఆసక్తిగా తొంగి చూసింది.

'ఇవాళ జానకి బాగా గుర్తొస్తోంది. రాత్రి ఏ వేళకి ఇంటికి వచ్చినా మా ఆవిడ వేడి వేడిగా వడ్డించేది. ఇవాళ చల్లన్నంలో చెయ్యి పెట్టగానే జానకి గుర్తొచ్చింది. ఆ ప్రేమ, ఆ శ్రద్ధ కేవలం భార్యనించి మాత్రమే పొందగలం.'

'ఇవాళ అద్దంలో ముఖం చూసుకుంటే సరిగ్గా కనపడలేదు. పోగాలము దాపురించిన వాళ్ళకి అద్దంలో మొహం కనపడదు అని మా తెలుగు మాస్టారు ఓ పద్యం చెప్పేవారు. అదే అనుకున్నా కానీ దుమ్ము. వేలితో అద్దం మీద సంతకం చేసాను. జానకి అద్దాన్నే కాదు. ఇల్లంతా అద్దంలా ఉంచేది. పనివాళ్ళు ఇంటివాళ్ళలా చేయలేరు – ఎంత జీతం ఇచ్చినా.'

'ఇవాళ మనసంతా బాధగా ఉంది. నా పుట్టినరోజు. మా అబ్బాయి, కోడలు, మనవడు వీడియో కాల్ చేసి విష్ చేసారు. మా కోడలు సంధ్య వంటమనిషికి ఫోన్ చేసి, నాకు ఇష్టమైన పాయసం, గారెలు చేయమని చెప్పిందిట. ఆవిడ పులిహోర కూడా చేసింది. కాని జానకి జ్ఞాపకాలతో హృదయం బరువెక్కింది. జానకి పాయసంలో ఒక్క చుక్క నీళ్ళు కూడా పోసేది కాదు. సేమ్యాని పూర్తిగా పాలతోనే ఉడికించేది. చివర్లో మిల్క్ మెయిడ్ రెండు చంచాలు కలిపేది. వంటావిడ నీళ్ళతో ఉడికించింది. రుచి లేదు. జానకి గారెలపిండి రుబ్బేప్పుడు కొంత పప్పు విడిగా ఉంచి తరవాత రుబ్బిన పిండిలో కలిపి గారెలు వేసేది. అవి కరకరలాడుతూ ఎంత బావుండేవో. వంట మనిషి చేసిన గారెలు నూనె పీల్చుకుని తినబుద్ధికాలేదు.'

కుమార్ పెద్దగా నవ్వి ఆ పోస్ట్ కింద ఒక కామెంట్ రాసి ఎంటర్ నొక్కాడు.

"ఒరేయ్! ఏం రాసావు? అంకుల్ నన్ను అపార్థం చేసుకుంటారు" శివ కంగారుగా ఫోన్‌లోకి వంగి చూసాడు.

"అందులో అపార్థానికేం లేదులే చూడు" కుమార్ ఫోన్ మిత్రుడికి ఇచ్చాడు.

'వెరీ సేడ్ అంకుల్. ఆంటీ బర్త్‌డే ఎప్పుడు? ఆ రోజు మీరు ఆంటీ కోసం ఏం చేసేవారు?'

"ఇంతేనా? ఐతే పర్లేదు. ఆ స్మృతులన్నీ అంకుల్ చాలా బాగా రాస్తారు" శివ ఫోన్ తిరిగి ఇచ్చేసాడు.

'ఇవాళ స్నానం చేసి బనీన్ వేసుకుంటుంటే రోతగా అనిపించింది. ఎంత మురిగ్గా ఉందో. జానకి నా బట్టలని మల్లెపూవుల్లా ఉంచేది. లుంగీలు, బనీన్లు కూడా తెల్లగా తళతళలాడేవి. ఇప్పుడో? నీరు కావిపట్టి అలుగ్గుడ్డల్లా ఉన్నాయి. జానకి ముద్ర ఇంట్లోని ప్రతి వస్తువు మీదా ఉంది.'

'తమ్ముడు ఫోన్ చేసి, తన బర్త్‌డేకి విష్ చేయలేదని నిష్ఠూరాలు ఆడాడు. నాకు తేదీలు గుర్తుండవు. జానకే ఇవాళ ఫలానా వాళ్ళ పుట్టినరోజు, పెళ్ళి రోజు అని గుర్తుచేసేది. నేను వాళ్ళకి ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పేవాడిని. ఇవాళ తమ్ముడు ఫోన్ చేస్తే అనిపించింది – నేను ఎంతమందికి శుభాకాంక్షలు చెప్పడం మర్చిపోయానో కదా!'

'ఇంటికి వెళ్ళాలంటే దిగులు, బాధ. నా కోసం ఎదురు చూసే వారెవరూ ఇప్పుడు లేరు. ఏ వస్తువు ఎక్కడుందో తెలీడంలేదు. జానకి చేతిలో మేజిక్ ఉంది. అన్నీ క్షణాల్లో కళ్లముందు ఉండేవి. ఇప్పుడో? గంటల తరబడి వెదకాల్సి వస్తోంది. బేంక్ పాస్ బుక్ కోసం వారం రోజులు వెదికాను. జానకి..జానకి.. ఎందుకంత తొందరగా వెళ్ళిపోయావు?'

కుమార్ అసహనంగా ఫోన్ మిత్రుడి చేతిలో పెట్టేసాడు.

"అంకుల్ ఎంత బాధాకరమైన జీవితం గడుపుతున్నారో అర్థమైంది కదా మీరు ఆయన్ని ఇక్కడికి రమ్మని పిలవచ్చుగా?" శివ చనువుగా అడిగాడు.

"ఆయనకేం బాధలేదు శివా. అమ్మ పోయాక సంధ్య ఆయన్ని మాతో రమ్మని బతిమాలింది. 'నాకు లక్షరూపాయలు పెన్షన్ వస్తుంది. ఇంటి అద్దెలు వస్తాయి. సొంత ఇల్లుంది. ఇక్కడ నా ఫ్రెండ్స్ ఉన్నారు. ఆరోగ్యంగా ఉన్నాను. మీ అత్తయ్య ఉన్నప్పటికన్నా ఆనందంగా స్వేచ్ఛగా ఉంటాను. 'నేను రాను' ఎగ్జాక్ట్‌గా ఇవే మాటలు కాకపోయినా ఇదే అర్థంతో తోసి పుచ్చాడు. నేనూ చెప్పాను. 'రానురా' అన్నాడు.

'పోనీ మేం వచ్చి ఉండమా?' అని అడిగాను.

'అక్కర్లేదు' అన్నాడు.

మేం ఏం చేయాలో చెప్పు. అప్పటికీ వీలున్నప్పుడు వెళ్తున్నాం. సంధ్య ఇల్లు సర్ది, వంటలు చేసి పెట్టి చూసుకున్నా 'ఎప్పుడు వెళ్తున్నారా?' అని అడుగుతాడు" కుమార్ కోపంగా చెప్పాడు.

"అంకుల్‌కి లౌక్యం తెలీదురా. అంటీ కోసం ఆయన పడే బాధ..."

"ఆపు. ఆయన అమ్మని ఎంత టార్చర్ పెట్టాడో నాకు తెలుసు. ఏ గృహస్తు అయినా ఆఫీస్ అయ్యాక ఇంటికి వస్తాడు. కాని ఆయన మాత్రం పెత్తనాలు చేసి అర్ధరాత్రి, అపరాత్రి ఇంటికి వచ్చేవాడు. మీ అందరూ మీ పేరెంట్స్‌తో సాయంత్రాలు షికార్లకి వెళ్తూ, టి.వి చూస్తూ గడిపితే, మా ఇంట్లో అమ్మా, నేను ఇద్దరమే గ్లూమీగా గడిపేవాళ్లం. ఆయన ఏ టైముకి ఇంటికి వస్తాడో తెలీదు. నేను తొమ్మిదవగానే నిద్రపోయేవాడిని. అమ్మ మెలకువగా కూర్చుని పుస్తకాలు చదువుకునేది. ఆయన స్నానం చేసి వచ్చేలోగా అన్ని పదార్థాలు వేడి చేసేది. మనలా మైక్రోవేవ్ ఓవెన్స్ లేవు ఆ రోజుల్లో, రెండు బర్నర్ల స్టవ్ మీద ఒకదాని తర్వాత ఒకటి వేడి చేసేది. ఒక స్టవ్ మీద అన్నం వండేది. అన్నం పొడిపొడిగా లేదని, ముద్దగా ఉందని అమ్మ ఎన్నిసార్లు చివాట్లు తిందో నాకు తెలుసు. అమ్మకి శుభ్రం ఎక్కువ. ఇల్లంతా నీట్‌గా ఉండాలి, పెట్టిన వస్తువు పెట్టిన చోటే ఉండాలి అనేది. ఆయనకి బొత్తిగా శుభ్రం లేదు. ఎక్కడివి అక్కడే పడేసి పోయేవాడు. అమ్మ ఓపిగ్గా సర్దేది. 'ఏ వస్తువూ కనపడదు. అన్నీ దాచిపెడతావు' అని తిట్టేవాడు."

సంధ్య వారిస్తున్నట్లుగా అతని చెయ్యి మీద చెయ్యి వేసింది.

"పర్లేదు. శివ మనవాడే. ఇంటి గుట్టు చెప్పడం ఎందుకు అని సంధ్య ఉద్దేశం. మన మనసుల్లోని బాధనో, సంతోషాన్నో మనం డైరీల్లో రాసుకునేవాళ్ళం. ఎందుకంటే మన భావోద్వేగాలు బయటివారికి తెలీడం మనకి ఇష్టం ఉండదు. అవి మన ఫీలింగ్స్. మరి ఇప్పుడాయన ఫేస్‌బుక్‌లో అవన్నీ రాయడం ఎందుకు? చదివిన వాళ్ళు ఎవరైనా వచ్చి ఆయన పుట్టినరోజుకి మిల్క్ మెయిడ్‌తో పాయసం చేసి పెడతారా? ఆయన లుంగీ బనీన్లు తెల్లగా ఉతుకుతారా?" కుమార్ ఆవేశంగా అడిగాడు.

శివ మాట్లాడలేదు.

"తన పుట్టిన రోజుని ఇంత గారాబంగా చిన్ని కృష్ణుడిలాగా జరిపించుకునే ఆయనకి అమ్మ బర్త్‌డే ఎప్పుడో కూడా తెలీదు. నా పుట్టిన రోజున కూడా త్వరగా ఇంటికి వచ్చేవాడు కాదు. స్కూల్‌నించి వచ్చాక అమ్మ నన్ను రెస్టారెంట్‌కి తీసుకెళ్ళి నాకు ఇష్టమైన టిఫిన్స్ తినిపించి ఐస్‌క్రీం కొనిచ్చేది. ఆయన పట్టించుకునేవాడుకాదు. కాని ఆయనకి బయటివాళ్ళు చాలా ముఖ్యులు. కాబట్టి వాళ్ళ పుట్టినరోజులు, పెళ్ళి రోజులు రిమైండ్ చేసే బాధ్యత అమ్మది. ఆమె చెపితే, ఆయన కులాసాగా వాళ్ళకి ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పేవాడు. అమ్మ ఎప్పుడైనా మర్చిపోతే, ఇంటికి వచ్చి తిట్టేవాడు. 'వాడి ముందు పరువుపోయింది' అనేవాడు."

సంధ్య మరోసారి అతన్ని తట్టింది.

"అమ్మ పోయాక ఈ పిచ్చిది అత్తగారిలాగా ఆయన్ని పేంపర్ చేద్దామనుకుంటే, ప్రతీదానికి వంకలు పెట్టేవాడు. 'మీ అత్తగారిలా చేయలేదు' అనేవాడు. ఒకళ్ళలా మరొకళ్ళు ఎలా చేస్తారు? నాకు ఆయనంటే విరక్తి పుట్టింది శివా. తండ్రి కాబట్టి వీలున్నప్పుడు వెళ్ళి నాలుగురోజులు ఉండి వస్తా అంతే."

"వాటికింద కామెంట్స్ చూసావా? అంకుల్‌కి శ్రేయోభిలాషులు చాలామంది ఉన్నారు. వాళ్ళు సానుభూతిగా మాట్లాడతారు. ఓదారుస్తారు." శివ చెప్పాడు.

"బుద్దున్న ఎవరికైనా ఆ పోస్టింగ్స్ చదివితే అర్థం అవాల్సింది ఆయన భార్యని మిస్ అవుతున్నాడని కాదు."

"మరి?"

"మంచి పనిమనిషిని. ఆల్ ఇన్ వన్. ఒక పనిమనిషిని. ఇల్లు శుభ్రంగా ఉంచి, వేడిగా వండి వడ్డించి తనని బద్ధకస్థుడిలా గారాబం చేసే పనిమనిషిని ఆయన బాగా మిస్సవుతున్నాడు. నేను ఒప్పుకుంటాను."

సంధ్య నవ్వింది.

"నాకు అన్నీ చదివే ఓపిక లేదుకాని, మా నాన్న మా అమ్మతో గడిపిన మధురక్షణాలు, స్మృతులు, అనుభూతులు ఏమైనా రాసాడా?" కుమార్ అడిగాడు.

శివ మాట్లాడలేదు.

"లేదుకదా? ఎందుకంటే మా నాన్న భార్యని కేవలం 'కార్యేషుదాసి' లాగే చూసాడు. అంతకు మించి రెండో చరణం దాకా కూడా పోలేదు" కుమార్ పెద్దగా నవ్వుతూ చెప్పాడు.

(వచ్చే సంచికలో మరో సరిగమ)

Click here to share your comments